సాక్షి
వికారాబాద్
శనివారం । 8 । ఫిబ్రవరి । 2025



ఉన్నతంగా రాణించాలి

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని మహిళా సాధికారత బృందం సభ్యురాలు వరలక్ష్మి అన్నారు. 10లో



బిల్లులు చెల్లించొద్దు

పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న పనులకు బిల్లులు చెల్లించరాదని ఎక్కాయి ఎంపీపీఎస్ వద్ద గ్రామస్తులు ఆందోళన చేశారు. 10లో



కొడంగల్ ఆస్పత్రికి మహర్దశ

గతంలో ధర్నాసుపత్రిగా పేరుగాంచిన కొడంగల్ ప్రభుత్వాస్పత్రికి మహర్దశ పట్టనుంది. 11లో

న్యూస్‌రీల్

ముదిరాజ్‌ల అభ్యున్నతికి కృషి



గుండాల గ్రామంలో ముదిరాజ్ భవనాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న నేతలు

దోమ: ముదిరాజ్‌ల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని పీఏసీఎస్ చైర్మన్ యాదవ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం దోమ మండలం గుండాల గ్రామంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాలి విజయకుమార్ రెడ్డి, గుండాల మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు డోకూరి అంజిలయ్యతో కలిసి సంఘం భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం సబ్బండ వర్గాల ఉన్నతికి కృషి చేస్తోందన్నారు. ముఖ్యంగా వెనుకబడిన తరగతుల వారందరికీ అవసరమైన పనిముట్లను సబ్సిడీతో అందించేందుకు చర్యలు తీసుకుంటోందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సైతం బీసీ కులాలకు తగిన న్యాయం చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. కార్యక్రమంలో పరిగి మార్కెట్ కమిటీ డైరెక్టర్ పట్లోళ్ల ప్రభాకర్ రెడ్డి, రాఘవేందర్ రెడ్డి, రమేష్ గౌడ్, అంతిరెడ్డి, యాదయ్య సాగర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

భూసేకరణ అభ్యంతరాలపై నేటి సమావేశం రద్దు

యాచారం: భూసేకరణ అభ్యంతరాలపై శనివారం రైతులతో కలెక్టరేట్‌లో జరిగే వ్యక్తిగత సమావేశం రద్దయినట్లు యాచారం తహసీల్దార్ అయ్యప్ప వెల్లడించారు. కలెక్టర్ నారాయణరెడ్డికి అత్యవసర సమావేశం ఉన్నందున నోటీసులపై జరిగే సమావేశాన్ని వాయిదా వేసినట్లు ఉన్నతాధికారుల నుంచి సమాచారం వచ్చిందని తెలిపారు. అయితే, వందలాది మంది రైతులు ఒక్కసారిగా కలెక్టరేట్‌కు వస్తే జరగరానిది జరిగితే పెద్ద సమస్యగా మారుతుందనే కోణంలో సమావేశాన్ని రద్దు చేసినట్లు తెలిసింది. సమావేశం రద్దయినప్పటికీ నోటీసులు అందుకున్న కొందరు రైతులు అనుకున్న సమయం ప్రకారం లాయర్లతో కలిసి కలెక్టరేట్ వెళ్లనున్నట్లు సమాచారం.

నూతన విద్యావిధానాన్ని రద్దు చేయాలి

షాద్‌నగర్‌రూరల్: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన విద్యావిధానాన్ని వ్యతిరేకిస్తూ ఏఐఎస్‌ఎఫ్ నిర్వహిస్తున్న జాతీయ సమావేశాలను విజయవంతం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు పవన్‌చౌహాన్ కోరారు. జాతీయ సమావేశాలకు సంబంధించిన కరపత్రాలను పట్టణ ముఖ్యకూడలిలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పవన్‌చౌహాన్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన జాతీయ విద్యావిధానాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నూతన విద్యా విధానం పేరుతో విద్యార్థులపై మతతత్వ భావజాలాన్ని రుద్దడానికి కుట్రలు పన్నుతోందని ఆరోపించారు. నూతన జాతీయ విద్యావిధానానికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో తక్షణమే విద్యాశాఖ మంత్రిని నియమించాలన్నారు. హైదరాబాద్‌లో ఈ నెల 9న ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న సెమినార్‌కు విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి హాజరు కానున్నారని, 10న జాతీయ సమావేశాలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో సంఘం సంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శులు శివకుమార్, ఆకాష్‌నాయక్, అమీర్, కార్తీక్ పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించండి

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్రంలో దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక కమిటీ జిల్లా అధ్యక్షుడు భుజంగరెడ్డి డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా దివ్యాంగులకు పెన్షన్ అందించాలని కోరుతూ శుక్రవారం 'చలో ఢిల్లీ' కార్యక్రమానికి తరలివెళ్లారు. ఈ సందర్భంగా భుజంగరెడ్డి మాట్లాడుతూ.. ఇందిరాగాంధీ జాతీయ పెన్షన్ దివ్యాంగులందరికీ వర్తింపజేయాలని, పెన్షన్ పొందడం దివ్యాంగుల హక్కుగా చట్టాన్ని తీసుకురావాలని అన్నారు. రైలు ప్రయాణంలో రాయితీ సౌకర్యాన్ని పునరుద్ధరించాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రాయితీలు పొందేలా యూడీఐడీ కార్డును గుర్తింపు కార్డుగా పరిగణించాలని కోరారు. దివ్యాంగుల సంక్షేమానికి బడ్జెట్‌లో 5 శాతం నిధులు కేటాయించాలని, విద్యాభివృద్ధికి తమిళనాడు, మహారాష్ట్రాల తరహాలో ప్రత్యేక పాలసీ తేవాలన్నారు. ఈ నెల 10న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిర్వహించనున్న బహిరంగ సభలో తమ డిమాండ్లను వ్యక్తపరుస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో కమిటీ జిల్లా ప్రధానకార్యదర్శి రాజు పాల్గొన్నారు.

రెవెన్యూ లీలలు..!

- ఒక్కో పనికి ఒక్కో రేటు ఫిక్స్
- బయటపడుతున్న తహసీల్దార్ల పాత్ర
- హాట్ కేకులుగా ఐదారు కార్యాలయాలు
- అధికారుల అక్రమార్జనకు పేద రైతులు బలి
- పోస్టింగుల కోసం పెద్ద ఎత్తున పైరవీలు, ముడుపులు

వికారాబాద్: జిల్లాలో రెవెన్యూ శాఖ లీలలు ఒక్కొక్కటిగా వెలుగుచూస్తున్నాయి. అధికారులు.. వారి కింద పని చేసే సిబ్బంది అడ్డగోలుగా దండుకుంటున్నారు. మొన్న మోమిన్‌పేట్‌లో, నిన్న పూడూరు, తాండూరు, నేడు వికారాబాద్, ధారూరు, పరిగి కార్యాలయాల్లో అధికారులు, సిబ్బంది బాగోతం బయటపడిన విషయం తెలిసిందే. ఒకచోట ఫోర్జరీలు.. మరోచోట నకిలీ ధ్రువపత్రాలు.. ఇంకోచోట అధికారుల కళ్లు గప్పి వారి డిజిటల్ కీల చౌర్యం.. తప్పుడు విరాసత్‌లు.. ఇలా రెవెన్యూ అధికారుల అవినీతి పరంపర కొనసాగుతూనే ఉంది. ఇటీవల తాండూరులో రూ.5 లక్షల లంచం తీసుకుంటూ తహసీల్దార్, ఆర్‌ఐ పట్టుబడిన ఘటన మరువక ముందే పూడూరులో భూ యజమానికి తెలియకుండా రిజిస్ట్రేషన్ జరిగిన తంతు వెలుగు చూసింది. ఇందులో డిప్యూటీ తహసీల్దార్ ప్రమేయం ఉండటంతో ఆయన్ను సస్పెండ్ చేసి.. ఆర్‌ఐని కలెక్టరేట్‌కు అటాచ్ చేశారు. తరచూ ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నా ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. కొన్నిసార్లు నామ మాత్రపు చర్యలతో సరిపెడుతున్నారు. దీంతో అవకతవకలు పునరావృతం అవుతూనే ఉన్నాయి.



ఇటీవల తమ భూములు కాజేశారంటూ అడిషనల్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న ఎన్కెపల్లి రైతులు

డబ్బులిస్తే చకచకా పనులు

అన్ని పత్రాలు ఉండీ ఏళ్ల తరబడి తిరుగుతన్నా కొందరి పనులు మాత్రం కావడం లేదు. అదే డబ్బులిచ్చే వారి పనులు మాత్రం చకచకా జరిగిపోతున్నాయి. ఒక్కో పనికి ఒక్కో రేటు ఫిక్స్ చేసి దండుకుంటున్నారు. ధరణిలో ఏ సమస్య ఉన్నా.. రైతులు మీసేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. తప్పొప్పులను సరి చేయటానికి ఆర్‌ఐ, డీటీ ఇచ్చే రిపోర్టు ఆధారంగా తహసీల్దార్లు ఉన్నతాధికారుల లాగిన్‌లోకి పంపిస్తారు. ఇలా చేయడానికి రైతుల నుంచి రూ.5వేల నుంచి రూ.50 వేల వరకు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు తహసీల్దార్ కార్యాలయాల్లో నిబంధనలకు విరుద్ధంగా భూ బదలాయింపులు జరుగుతున్నాయి. అక్రమాలు వెలుగు చూస్తున్న ప్రతిచోటా నెపం కింది స్థాయి ఉద్యోగులు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులపై మోపి అధికారులు తప్పించుకుంటున్నారు. ఒక వేళ అధికారిది తప్పని తేలితే చర్యలు కూడా ఉండటం లేదు.



పూడూరు తహసీల్దార్ కార్యాలయం

ఈ మండలాల్లో పోస్టింగులకు డిమాండ్

జిల్లాలోని ఐదారు మండలాల్లో పోస్టింగులు తెచ్చుకోవడం అంటే వారి పంట పండినట్లే. ఆయా ప్రాంతాల్లో పోస్టింగుల కోసం ఆర్‌ఐలు మొదలుకొని డీటీలు, తహసీల్దార్ల వరకు ఎగబడుతుంటారు. పూడూరు, మోమిన్‌పేట, నవాబుపేట, వికారాబాద్, పరిగి, తాండూరు, ధారూరు, కోట్‌పల్లి, బంట్వారం, మర్పల్లి మండలాల్లో భూముల రేట్లు ఎక్కువగా ఉన్నాయి. రిజిస్ట్రేషన్లు కూడా ఎక్కువగానే జరుగుతుంటాయి. ఈ మండలాల్లో ఆదాయం బాగుండటంతో పోస్టింగుల కోసం ఎగబడుతున్నారు. పలు మండలాలపై ఏసీబీ అధికారుల నిఘా కూడా ఉన్నట్లు సమాచారం.

ఇటీవల చోటు చేసుకున్న కొన్ని ఉదాహరణలు

- ఇటీవల పూడూరు మండలం చన్గోముల్ గ్రామ సర్వే నంబర్ 496లో సుమారు రూ.10 కోట్ల విలువ గల 10.22 ఎకరాల భూమిని యజమానికి తెలియకుండా థర్డ్ పార్టీకి అప్రూవల్ చేశారు. ఇందులో డిప్యూటీ తహసీల్దార్ కిషోర్ పాత్ర ఉందని తేలింది. డీటీని సస్పెండ్ చేయగా ఆర్‌ఐని కలెక్టరేట్‌కు అటాచ్ చేశారు.
- గతంలో మోమిన్‌పేట మండలంలో కూడా ఇలాంటి ఘటనే వెలుగు చూసింది. జీపీఏ చేసిన భూ యజమానికి తెలియకుండా తహసీల్దార్ జీపీఏ హోల్డర్‌కు అప్రూవల్ చేసి రిజిస్ట్రేషన్ చేశాడు. విషయం తెలుసుకున్న బాధితుడు ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. అదనపు కలెక్టర్ విచారణలో తహసీల్దార్ అక్రమాలు వెలుగు చూశాయి. అయితే అతనిపై ఇంకా ఎలాంటి చర్యలు తీసుకోలేదు.
- ఇటీవల పూడూరు మండలం ఎన్కెపల్లి శివారులోని సర్వే నంబర్ 115లో మైరాన్ వెంచర్ పేరుతో పెద్ద లేఅవుట్ వేశారు. ఈ భూములు దళితులకు చెందినవి.. అయితే వారి పూర్వీకులు తమకు విక్రయించినట్టుగా కొందరు రియల్టర్లు తప్పుడు ధ్రువ పత్రాలు సృష్టించి 19 ఎకరాల భూమిని కబ్జా చేశారని బాధితులు ఆరోపిస్తున్నారు. తాము విక్రయించమని చెప్పినా మరో 14 ఎకరాల భూమిని రాత్రికి రాత్రే కబ్జా చేసి బౌండరీలు ఏర్పాటు చేశారని ఇటీవల అడిషనల్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. భూమి వదిలేయకపోతే చంపుతామని బెదిరిస్తున్నారని దళిత రైతులు పేర్కొన్నారు. జిల్లాలో తరచూ ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటికైనా జిల్లా స్థాయి అధికారులు రెవెన్యూ కార్యాలయాల్లో జరుగుతున్న అక్రమాలపై నిఘా పెట్టాలని పలువురు కోరుతున్నారు.



సర్వేను అడ్డుకుంటున్న మహిళా రైతులు

మా బతుకులు ఆగం చేయొద్దు

- పేదల భూములు లాక్కొని పెద్దలకు ఇస్తారా..
- ఇదెక్కడి న్యాయం
- రోటిబండ తండా భూ బాధితుల ఆవేదన

దుద్యాల్: ప్రభుత్వం బలవంతంగా భూములు తీసుకొని మా బతుకులను ఆగం చేస్తోందని దుద్యాల్ మండలం రోటిబండ తండా పారిశ్రామికవాడ భూ బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం తండాలో రెవెన్యూ అధికారులు చేపట్టిన భూ సర్వే ప్రక్రియను అడ్డుకునే ప్రయత్నం చేశారు. పేదల భూములు లాక్కొని పెద్దలకు ఇవ్వడం ఇదెక్కడి న్యాయమని నిలదీశారు. ఈ సందర్భంగా పలువురు గిరిజన మహిళలు మాట్లాడారు. మా పెద్దలు మాకు ఇచ్చిన ఏకైక ఆస్తి ఈ భూమే అన్నారు.. కొద్దపాటి పొలాన్ని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని పోలీసుల వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నదంతా లాక్కుంటే మా పిల్లలకు ఏం ఇవ్వాలని అధికారులను నిలదీశారు. తండాలో కేవలం 22 ఎకరాల అసైన్డ్ భూమి మాత్రమే ఉందని, దాంట్లో ఏం కంపెనీలు ఏర్పాటు చేస్తారని ప్రశ్నించారు.

నేడు హకీంపేట్‌లో పట్టా భూముల సర్వే

పారిశ్రామిక వాడ ఏర్పాటులో భాగంగా శనివారం మండలంలోని హకీంపేట్‌లో పట్టా భూములకు సర్వే నిర్వహించనున్నట్లు తహసీల్దార్ కిషన్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. గ్రామ పరిధిలోని 246 సర్వే నంబర్ మినహా మిగిలిన అన్ని(237 నుంచి 251 వరకు) సర్వే నంబర్లలోని 187 మంది రైతులకు చెందిన 146.34 ఎకరాల భూమిని సర్వే చేయనున్నట్లు తెలిపారు. రైతులు అందుబాటులో ఉండి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డీటీ వీరేశ్ బాబు పాల్గొన్నారు.

ప్రాణం తీసి భూమి తీసుకోండి



నా పేరిట 5 గుంటల భూమి మాత్రమే ఉంది. ఇందులో ఏ కంపెనీ ఏర్పాటు చేస్తారో అర్థం కావడం లేదు. భూమి కావాలంటే నా ప్రాణం తీసి తీసుకోండి. ఇది మా పెద్దల ఆస్తి.. నేను ఇవ్వను. ఏం పాపం చేశామని మమల్ని ఇంత ఇబ్బంది పెడుతున్నారో అర్థం కావడం లేదు.

– కిష్టిబాయి, మహిళా రైతు, రోటిబండ తండా

తావు లేకుండా చేస్తారా ?



నా పేరిట 10 గుంటల భూమి ఉంది. ఈ భూమిని ప్రభుత్వం గుంజుకోవాలని చూస్తోంది. పేదల కడుపుకొట్టి పెద్దల కడుపు నింపాలని చూస్తున్నారు. ఇదెక్కడి న్యాయమో ప్రభుత్వమే చెప్పాలి. ఉన్న కొద్దిపాటి భూమి ఇస్తే మాకు తావు కూడా ఉండదు. మా ప్రాణాలు తీసేసి భూములు తీసుకోండి.

– చాంది బాయి, మహిళా రైతు, రోటిబండ తండా



అంగన్‌వాడీ టీచర్లతో మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- చిన్నారులకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందించాలి
- అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసిన అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి

తాండూరు రూరల్: విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి అంగన్‌వాడీ టీచర్లను హెచ్చరించారు. శుక్రవారం ఆమె మండలంలోని రాంపూర్, గోవన్‌పల్లి, ఐనెల్లి, యాలాల మండలం తిమ్మాయిపల్లి అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గుడ్లు, అన్నం సరిగా ఇస్తున్నారా అని చిన్నారులను అడిగి తెలుసుకున్నారు. వారికి పలు ప్రశ్నలు వేసి పిల్లల సామర్థ్యాలను తెలుసుకున్నా రు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పిల్లల భవిష్యత్ అంగన్‌వాడీలపైనే ఉందన్నారు. చిన్నారులతో పాటు బాలింతలకు, గర్భిణులకు సక్రమంగా పౌష్టికాహారం అందించాలన్నారు. రిజిస్టర్లలో ఆయా వివరాలను క్రమం తప్పకుండా నమోదు చేయాలని ఆదేశించారు.

21 నుంచి ఫేస్ రికగ్నేషన్

పౌష్టికాహారం పక్కదారి పట్టకుండా జిల్లా వ్యాప్తంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ నెల 21 నుంచి ఫేస్ రికగ్నేషన్ యాప్ ద్వారా అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ట్రెయినీ కలెక్టర్ ఉమాహారతి అన్నారు. ఏడు నెలల శిశువు నుంచి మూడేళ్ల పిల్లల వరకు బాలామృతం, గుడ్లు అందించాలన్నారు. పోషన్ ట్రాకర్ కింద రూపొందించిన ఈ ప్రత్యేక యాప్‌లో ఫొటోలు తప్పక అప్‌లోడ్ చేయాలని చెప్పారు. ఆమె వెంట అసిస్టెంట్ సీడీపీఓ శ్రీలక్ష్మి, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు ఉన్నారు.

ఉన్నత లక్ష్యాలు సాధించాలి

- సెర్ప్ సీఈఓ దివ్యా దేవరాజన్

అనంతగిరి: విద్యార్థులు బాగా చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సెర్ప్ సీఈఓ దివ్యా దేవరాజన్ అన్నారు. శుక్రవారం వికారాబాద్‌లోని కొత్తగడి సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, కళాశాల(బాలికల)ను కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులతో మాట్లాడారు. ఎలా చదువుతున్నారు, భోజనం సరిగ్గా ఉందా.. సదుపాయాలు బాగున్నాయా అని అడిగారు. హాస్టల్ పరిసరాలు, వంటగది, మరుగు దొడ్లు, తాగునీటి సంపును పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం వడ్డిస్తున్నారా అని అడిగారు. రుచి, సుచిగా భోజనం ఉండాలని ఆదేశించారు. తరగతి గదులను పరిశిలించారు. విద్యార్థులు వారి గదులను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. ఇష్టంతో చదివితే మంచి ఫలితాలు వస్తాయన్నారు. బాగా చదువుకొని తల్లిదండ్రులు, గురువులు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. మీకు ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తేవాలని కోరారు. భోజన విషయంలో రాజీ పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎక్కువ కాలం నిల్వ ఉంచిన సరుకులను వాడరాదన్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను శ్రద్ధగా వినాలని సూచించారు. మంచిగా చదువుకుంటేనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని తెలిపారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. ఇందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. భోజనం చాలా బాగుందని కితాబు ఇచ్చారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, ఆర్‌డీఓ వాసుచంద్ర, ప్రిన్సిపాల్ సాయిలత తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్, సెర్ప్ సీఈఓ దివ్యా దేవరాజన్

చదువుకుంటేనే ఉజ్వల భవిష్యత్

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఎంచుకొని వాటి సాధన కోసం నిరంతరం శ్రమించాలని అదనపు కలెక్టర్ సుధీర్ సూచించారు. గురువారం రాత్రి వికారాబాద్‌లోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ బాలుర రెసిడెన్షియల్ పాఠశాల, జూనియర్ కళాశాలలో నిద్ర చేశారు. అంతకుముందు విద్యార్థులతో ముచ్చటించారు. ఎలా చదువుకుంటున్నారు.. భోజనం సరిగ్గా ఉందా.. అని ఆరా తీశారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ కృష్ణకుమార్ పాల్గొన్నారు.

ఆస్తులు అమ్మితేనే మనుగడ

- నార్మల్ మదర్ డెయిరీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి

హయత్‌నగర్: నష్టాల్లో కూరుకుపోతున్న డెయిరీని రక్షించుకోవాలంటే ఆస్తులను అమ్మి బకాయిలు తీర్చడం తప్ప వేరే మార్గం లేదని నల్లగొండ-రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల సమాఖ్య (నార్మల్ మదర్ డెయిరీ) చైర్మన్ గుడిపాటి మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం హయత్‌నగర్ మదర్ డెయిరీ ప్రాంగణంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో తీర్మానం ప్రవేశ పెట్టారు. కొంత కాలంగా నష్టాలు వస్తుండడంతో అప్పుల భారం పెరుగుతూ పోతోందని, నెలకు సుమారు రూ.40 లక్షలు వడ్డీ చెల్లిస్తున్నామని తెలిపారు. ఇదే పరిస్థితి కొనసాగితే డెయిరీ మనుగడే ప్రశ్నార్థకంగా మారుతుందని అభిప్రాయపడ్డారు. నష్టాలను తగ్గించేందుకు అనేక ప్రయత్నాలు చేశామని, రోజుకు 50-60 వేల లీటర్ల పాల అమ్మకాన్ని 80 వేల లీటర్ల వరకు పెంచామని చెప్పారు. అయినా వడ్డీల భారం పెరుగుతుండడంతో డెయిరీని అప్పుల ఊబిలో కూరుకుపోకుండా రక్షించేందుకు ఆస్తులు అమ్మాలని నిర్ణయించినట్లు ఆయన చెప్పారు. డెయిరీ మనుగడ రైతుల చేతుల్లోనే ఉందని, పాలకవర్గం ప్రతిపాదనకు చైర్మన్లు సానుకూలంగా ఉండాలని కోరారు. చైర్మన్ ప్రతిపాదనను ఆమోదిస్తూ మెజారిటీ చైర్మన్లు సంతకాలు చేసినట్లు అధికారులు తెలిపారు.

చైర్మన్ల విభిన్న వాదనలు

మదర్ డెయిరీ ఆస్తుల అమ్మకం ప్రతిపాదనపై రైతు సంఘాల చైర్మన్లు భిన్నమైన వాదనలు వినిపించారు. నష్టాలకు కారణమైన అధికారులు, గత పాలకవర్గ సభ్యులపై చర్యలు తీసుకోవాలని.. భూములను అమ్మకుండా ప్రభుత్వం నుంచి గ్రాంటు తేవాలని.. వ్యయాలను తగ్గించాలని.. సేల్స్ పెంచేందుకు అధికంగా ఉన్న ఉద్యోగులను వినియోగించాలని పలువురు సూచించారు. ఆస్తులు అమ్మితే ముందుగా రైతుల బకాయిలు చెల్లించాలని, మిగిలిన డబ్బులను వారికి బోనస్‌గా ఇవ్వాలని, అవసరమైతే మరోచోట ఆస్తులు కొనాలన్నారు. రైతులకు బకాయిలు చెల్లించిన తర్వాతే అప్పులు చెల్లిస్తామని.. ఆస్తుల అమ్మకం ఓపెన్ యాక్షన్ ద్వారా పారదర్శకంగా చేపడతామని చైర్మన్ మధుసూదన్‌రెడ్డి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎండీ కృష్ణ, మాజీ చైర్మన్లు గుత్త జితేందర్ రెడ్డి, గంగుల కృష్ణారెడ్డి, శ్రీకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

కబ్జాలను సహించేది లేదు

- హైడ్రా కమిషనర్ రంగనాథ్

తుక్కుగూడ: చెరువులు, కుంటలు, నీటి కాల్వలను కబ్జా చేస్తే సహించేంది లేదని హైడ్రా కమిషనర్ రంగనాథ్ హెచ్చరించారు. తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని సూరం చెరువు, కొత్తకుంట, పావని కుంటలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఇరిగేషన్ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ కుంటలు, చెరువు కబ్జాకు గురవుతున్నట్లు స్థానికులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారని తెలిపారు. దీంతో వీటిని పరిశీలించడానికి వచ్చినట్టు చెప్పారు. చాలామంది రియల్టర్లు వెంచర్లు వేసి, కాంపౌండ్ వాల్ నిర్మించి కబ్జా చేసినట్లు గుర్తించామన్నారు. సూరం చెరువు 60 ఎకరాల విస్తీర్ణం ఉండాల్సి ఉండగా ప్రస్తుతం సుమారు 38 ఎకరాల వరకు ఉందన్నారు. కబ్జా చేసిన వారు ఎంతటి వారైనా వదిలి పెట్టేది లేదన్నారు. మున్సిపాలిటీ వ్యాప్తంగా చెరువులు, కుంటలను కాపాడటానికి రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులతో చర్చిస్తామన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈఈ దుద్యానాయక్, ఏఈలు గోవింద్, నాగరాజు, హైడ్రా సీఐ తిరుమలేష్, ఆర్‌ఐ స్వర్ణకుమారి, ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.



మంఖాల్‌లో కొత్తకుంటను పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్ తదితరులు

క్లుప్తంగా

ఎనిమిది మంది బైండోవర్



తహసీల్దార్ మురళీధర్ ఎదుట నిందితులను బైండోవర్ చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

కుల్కచర్ల: నిబంధనలకు విరుద్ధంగా మద్యం అమ్మకాలు చేపడితే చర్యలు తప్పవని కుల్కచర్ల తహసీల్దార్ మురళీధర్ హెచ్చరించారు. ముజాహిద్‌పూర్ గ్రామానికి చెందిన నర్సింలు, రమేశ్, రవీందర్, తిరుమలయ్య, బి.రమేశ్, నిరంజన్, అంజిలయ్య, ఎం.నర్సింలు ఎన్నికల సమయంలో మద్యం అమ్ముతూ ఎక్సైజ్ పోలీసులకు పట్టుబడ్డారు, వారిపై ఆబ్కారీ శాఖలో కేసులు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం మండల కేంద్రంలో తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్‌ఐ దయాసాగర్, డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్, ఎక్సైజ్ సిబ్బంది విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు

తాండూరు టౌన్: మద్యం తాగి వాహనాలు నడిపిన ఇద్దరికి సబ్–కలెక్టర్, సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఉమాహారతి జైలు శిక్ష విధించారు. పట్టణ సీఐ సంతోష్‌కుమార్ తెలిపిన ప్రకారం.. పోలీసులు చేపట్టిన తనిఖీల్లో మద్యం తాగుతూ వాహనాలు నడిపిన లారీ డ్రైవర్ మంగలి రాములకు ఐదు, ఆటో డ్రైవర్ నర్సింలుకు రెండు రోజుల జైలు శిక్షతో పాటు రూ.వేయి జరిమానా విధించినట్లు చెప్పారు. పట్టు బడిన మరో 11 మందికి రూ.1,000 జరిమానా విధించారన్నారు. ఎనిమంది మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడగా.. వారు నడిపిన వాహన యజమానులకు రూ.2,500 చొప్పున జరిమానా విధించారని వివరించారు.

బీటెక్ విద్యార్థిని బలవన్మరణం



జ్యోతి (ఫైల్)

అనంతగిరి: ఓ బీటెక్ విద్యార్థిని ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. సీఐ భీంకుమార్ తెలిపిన ప్రకారం.. కుల్కచర్ల మండలం ముజాహిద్‌పూర్‌కు చెందిన సత్యనారాయణ వికారాబాద్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తూ గాంధీ కాలనీలో అద్దెకు ఉంటున్నాడు. ఈయనకు కుమారుడు, కూతురు సంతానం. శుక్రవారం స్వగ్రామంలో బంధువుల వివాహం ఉండడంతో బుధవారం కుటుంబ సభ్యులతో కలిసి ముజాహిద్‌పూర్‌కు వెళ్లారు. బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్న ఆయన కూతురు జ్యోతి(21) ఆన్‌లైన్ ఎగ్జామ్ ఉందని గురువారం అద్దె ఇంటికి వ చ్చింది. ఈ క్రమంలో అద్దె ఇంట్లో ఉన్న పెళ్లి బట్టలు తీసుకెళ్లేందుకు శుక్రవారం ఉదయం సత్యనారాయణ వచ్చి జ్యోతికి ఫోన్ చేసినా స్పందించలేదు. తలుపులు కొట్టినా తీయకపోవడంతో చుట్టు పక్కల వారి సహకారంతో తలుపులు తెరచి చూడగా సీలింగ్ ఫ్యాన్ కోసం ఏర్పాటు చేసిన కొక్కేనికి నైలాన్‌తాడుతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకున్నారు. మృతురాలి తండ్రి సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తొమ్మిదేళ్ల బాలికపై లైంగిక దాడి

పోక్సో కేసు నమోదు

అనంతగిరి: తొమ్మిదేళ్ల బాలికపై లైంగికదాడికి పాల్పడిన ఓ వ్యక్తి పోక్సో కేసు నమోదయింది. ఈ ఘటన వికారాబాద్ జిల్లా పరిధిలో చోటు చేసుకుంది. వివరాలు.. జిల్లా పరిధిలోని ఓ గ్రామంలో 3వ తరగతి చదువుతున్న తొమ్మిదేళ్ల బాలికపై వరుసకు మామ అయిన వ్యక్తి లైంగిక దాడికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సదరు వ్యక్తిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

పెళ్లి చేసుకోమంటే.. ప్రాణం తీశాడు

- ప్రియురాలిని హత్య చేసి పరారైన ప్రియుడు
- నాలుగు నెలలుగా తప్పించుకు తిరుగుతున్న నిందితుడు
- ఆధార్ కార్డు ఆధారంగా కేసు ఛేదించిన పోలీసులు
- నిందితుడికి రిమాండ్
- వివరాలు వెల్లడించిన పట్టణ సీఐ విజయ్‌కుమార్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ విజయ్‌కుమార్



షాద్‌నగర్‌రూరల్: ఒకే పరిశ్రమలో పని చేస్తున్న ఇద్దరి పరిచయం ప్రేమగా మారి వివాహేతర సంబంధానికి దారితీసింది. తరచూ వేరే వ్యక్తులతో ఫోన్ మాట్లాడుతున్న ప్రియురాలు పెళ్లి విషయం తీసుకురావడంతో ఆమెను అడ్డుతొలగించుకునేందుకు ప్రియుడు హత్య చేసి పరారయ్యాడు. కొన్ని నెలలుగా తప్పించుకు తిరుగుతున్న నిందితుడిని సాంకేతిక ఆధారాలతో పట్టుకున్న పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు వివరాలను శుక్రవారం పట్టణ సీఐ విజయ్‌కుమార్ విలేకరులకు వెల్లడించారు.

పనిచేసే చోట పరిచయం

మధ్యప్రదేశ్ రాష్ట్రం, అనుప్పూర్ జిల్లా నింహో గ్రామానికి చెందిన సంజయ్‌చంద్ర అలియాస్ సంజయ్ మహోర కొంత కాలంగా దూసకల్ సమీపంలోని ఓ చాక్లెట్ పరిశ్రమలో పని చేస్తూ మున్సిపాలిటీ పరిధిలోని చటాన్‌పల్లిలో నివాసం ఉంటున్నాడు. అదే పరిశ్రమలో పని చేస్తున్న అనుప్పూర్ జిల్లా జేతరి గ్రామానికి చెందిన జ్యోతిసింగ్(24)తో పరిచయం ఏర్పడింది. వారి పరిచయం కాస్తా వివాహేతర సంబంధానికి దారి తీసింది. వీరు ఇరువురూ పెళ్లి చేసుకోవాలనుకున్నారు. జ్యోతిసింగ్ తన స్నేహితురాలు గీతతో కలిసి చటాన్‌పల్లి సమీపంలో అద్దెకు ఉండేది.

పెళ్లి చేసుకోకుంటే పరువు తీస్తా

సంజయ్‌చంద్ర, జ్యోతిసింగ్ ఏకాంతంగా ఉన్న సమయంలో జ్యోతిసింగ్‌కు వేరే వ్యక్తుల నుంచి ఫోన్ కాల్స్ వచ్చేవి. వారితో ప్రత్యేకంగా ఫోన్ మాట్లాడంతో ఇరువురి మధ్య ఘర్షణ జరిగింది. దీంతో కొంత కాలంగా సంజయ్‌చంద్ర ఆమెను దూరం పెడుతూ వస్తున్నాడు. ఈ నేపథ్యంలో వివాహ విషయం ఏమైందని జ్యోతిసింగ్ సంజయ్‌చంద్రను ప్రశ్నించడంతో నువ్వు వేరే వ్యక్తులతో ఫోన్‌లో మాట్లాడుతున్నావు చేసుకోనని సమాధానం ఇచ్చాడు. దీంతో పెళ్లి చేసుకోకపోతే నీపై కేసు పెడతానని, మీ ఇంటికి వెళ్లి మన విషయం చెప్పి పరువు తీస్తానని సంజయ్‌ని బెదిరించింది. దీంతో సంజయ్‌చంద్ర ఆమె అడ్డు తొలగించుకోవాలని హత్యకు పథకం వేసుకున్నాడు.

హత్యచేసి.. పరారీ

వివాహ విషయం మాట్లాడదామని సంజయ్‌చంద్ర 2024 నవంబర్ 28న జ్యోతిసింగ్‌కు ఫోన్‌చేశాడు. దీంతో ఆమె ప్రియుడు చెప్పినట్లు చటాన్‌పల్లి శివారులోని న్యాట్కో పరిశ్రమకు వెళ్లే రోడ్డు వద్దకు వచ్చింది. అక్కడ నుంచి నిర్మానుష్య ప్రదేశానికి తీసుకు వెళ్లిన తరువాత ఇద్దరి మధ్య గొడవ జరిగింది. సంజయ్‌చంద్ర ముందస్తు పథకం ప్రకారం.. జ్యోతిసింగ్‌ను వరిపొలంలోని బురదలో పడేసి మెడపై కాలుపెట్టి ఊపిరాడకుండా చేసి హత్యచేశాడు. ఆమె మృతదేహాన్ని పూడ్చేసి అక్కడ నుంచి పరారయ్యాడు.

సోదరుడి ఫిర్యాదుతో మిస్సింగ్ కేసు

మృతురాలు జ్యోతిసింగ్ కొన్ని రోజులు కనిపించడంలేదు, ఫోన్ కలవడంలేదని మృతురాలి సోదరుడు రాకేష్‌కుమార్ 2024 డిసెంబర్ 5న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తుండగా.. నాలుగు రోజుల తరువాత గుర్తు తెలియని మహిళ శవం బయట పడింది. దీంతో మృతదేహాన్ని చూసిన రాకేష్‌కుమార్ తన చెల్లెలు జ్యోతిసింగ్‌గా గుర్తించాడు.

ఆధార్ ఆధారంగా

మహిళ హత్య కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మృతురాలి ప్రియుడు ఇక్కడ లేకపోవడంతో పోలీసులు సంజయ్‌చంద్రపై అనుమానంతో దర్యాప్తును చేపట్టారు. మృతుడి ఇంటికి వెళ్లినా నిందితుడు దొరకలేదు. నిందితుడు సిమ్ కార్డులను మార్చుతూ మహారాష్ట్రలో తలదాచుకున్నట్లు గుర్తించిన పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో దర్యాప్తును ముమ్మరం చేశారు. ఆధార్‌కార్డు ఆధారంగా సంజయ్‌చంద్ర మార్చిన సిమ్ నంబర్‌ను గుర్తించారు. అదే సిమ్‌కార్డు నుంచి సంజయ్‌చంద్ర తన తండ్రికి ఫోన్ చేశాడు. దీంతో సంజయ్‌చంద్రను మహారాష్ట్రలోని గడ్చిరోలి అటవీప్రాంతంలో తలదాచుకున్నట్లు గుర్తించి అరెస్టు చేశారు. నిందితుడిని అదుపులోకి తీసుకొన్న పోలీసులు తమదైన శైలిలో విచారించగా సంజయ్‌చంద్ర నేరాన్ని ఒప్పుకొన్నాడు. జ్యోతిసింగ్‌ని హత్య చేసిన ప్రదేశానికి నిందితుడిని తీసుకొని వెళ్లిన పోలీసులు పూర్తి వివరాలను సేకరించారు. అనంతరం సెల్ ఫోన్ స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

రివార్డులు ఇస్తాం: సీఐ

మహిళ హత్య కేసును నమోదు చేసిన పోలీసులు కేసును ఛేదించారు. సీపీ అవినాష్‌మహంతి పర్యవేక్షణలో శంషాబాద్ డీసీపీ రాజేష్, అడిషనల్ డీసీపీ రాంకుమార్, ఏసీపీ రంగస్వామి ఆధ్వర్యంతో విచారణ అధికారి పట్టణ సీఐ విజయ్‌కుమార్ నేతృత్వంలో ఎస్‌ఐలు సుశీల, శరత్‌కుమార్, సిబ్బంది కేసును ఛేదించారు. నిందితుడిని పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్‌ఐలు సుశీల, శరత్‌కుమార్, సిబ్బంది నరేందర్, కరుణాకర్, మహేష్, రఫీలకు పోలీసు ఉన్నతాధికారులతో రివార్డులను ఇప్పిస్తామని పట్టణ సీఐ విజయ్‌కుమార్ తెలిపారు.

మహిళలు ఉన్నతంగా రాణించాలి



బేటీ బచావో బేటీ పడావో దశాబ్ది ఉత్సవాలు

మహిళా సాధికారత బృందం సభ్యురాలు వరలక్ష్మి

పరిగి: సమాజంలో మహిళలు తమకంటూ ప్రత్యేక గుర్తింపు పొందేందుకు అన్ని రంగాల్లో రాణించాలని మహిళా సాధికారత బృందం సభ్యురాలు వరలక్ష్మి అన్నారు. పట్టణ కేంద్రంలో మహిళా శిశుసంక్షేమ శాఖ, మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో మహిళలకు కుట్టు మిషన్ శిక్షణ అందిస్తున్నారు. శిక్షణ పొందుతున్న మహిళలకు శుక్రవారం బేటీ బచావో బేటీ పడావో దశాబ్ది ఉత్సవాలల్లో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వరలక్ష్మి మాట్లాడుతూ.. సమాజంలో లింగ వివక్షత చూపకుండా అందరిని సమానంగా చూడాలన్నారు. తల్లిదండ్రులు కొడుకూ, కూతురులను సమానంగా చూడాలని చెప్పారు. బాల్య వివాహాలు చేయడం నేరమన్నారు. మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగాలని అందుకు ప్రభుత్వాలు అన్ని రకాలుగా సహకరిస్తుందని వివరించారు. చైల్డ్‌లైన్ సమస్యలుంటే 1098 కి కాల్ చేసి సమాచారం అందించాలని కోరారు. మహిళలను ఆర్థికంగా, ఉపాధిలో ఉన్నతంగా ఉంచాలని ఎన్నో పథకాలను అందిస్తున్నాయని చెప్పారు. వాటిని సద్వినియోగం చేసుకుని ఉన్నతంగా రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా సాధికారత బృందం సభ్యులు రాందాస్ పాల్గొన్నారు.

పింఛన్ డబ్బు కోసం నానమ్మపై దాడి

మనుమడికి రిమాండ్



నరేశ్(ఫైల్)

తాండూరు రూరల్: పింఛన్ డబ్బు కోసం నానమ్మపై మనుమడు దాడి చేశాడు. ఈ ఘటన కరన్‌కోట్ ఠాణా పరిధి చెంగోల్ గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన బైరంపల్లి మాణెమ్మకు సుధాకర్, వెంకటప్ప సంతానం. సుధాకర్ కొడుకు నరేశ్ కూలీ పనులు చేసుకుంటూ గ్రామంలోనే ఉంటున్నాడు. నానమ్మ వద్ద ఉంటున్న నరేశ్ పింఛన్ డబ్బులు ఇవ్వాలని నానమ్మను వేధిస్తున్నాడు. శుక్రవారం ఉదయం 6గంటల ప్రాంతంలో నరేశ్ మరోమారు డబ్బు ఇవ్వాలని మాణెమ్మను కోరాడు. ఇందుకు ఆమె నిరాకరించడంతో నరేశ్ ఇంట్లోని ఇనుపరాడ్ తీసుకుని తలపై దాడి చేశాడు. ఈ ఘటనలో వృద్ధురాలు గాయపడడంతో జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మాణెమ్మ కుమారుడు వెంకటప్ప ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నరేశ్‌ను రిమాండ్‌కు తరలించారు.

ఎట్టకేలకు కీచక ఉపాధ్యాయుడి అరెస్ట్

- 56 రోజుల తర్వాత అదుపులోకి తీసుకున్న సీసీఎస్ పోలీసులు
- రిమాండ్‌కు తరలింపు



పోలీసుల అదుపులో కిష్టయ్య

ధారూరు: విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన కీచక ఉపాధ్యాయుడిని ఎట్టకేలకు(56 రోజుల తర్వాత) అరెస్టు చేశారు. శుక్రవారం సికింద్రాబాద్‌లోని ఓ లాడ్జిలో నిందితున్ని అదుపులోకి తీసుకున్న సీసీఎస్ పోలీసులు ధారూరు పోలీసులకు అప్పగించారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. ధారూరు మండలం స్టేషన్ ధారూరు ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు కిష్టయ్య 6, 7వ తరగతుల విద్యార్థినులను శారీరకంగా, మానసికంగా వేధించాడు. ఈ విషయాన్ని బాలికలు తల్లిదండ్రులకు చెప్పడంతో అప్పట్లో ధారూరు పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితున్ని అరెస్టు చేయాలని గ్రామస్తులు పట్టుపట్టారు. ఈ విషయం ఎస్పీ దృష్టికి వెళ్లడంతో కిష్టయ్యను అదుపులోకి తీసుకోవాలని స్థానిక పోలీసులను ఆదేశించారు. ఫలితం లేకపోవడంతో కేసును వికారాబాద్ సీసీఎస్ పోలీసులకు అప్పగించారు. వారు గాలింపు చేపట్టి సికింద్రాబాద్‌లో కీచక ఉపాధ్యాయుడిని అరెస్టు చేశారు. నిందితున్ని కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ వేణుగోపాల్‌గౌడ్ తెలిపారు.

‘సాక్షి’ చేయూత అభినందనీయం

బషీరాబాద్ తహసీల్దార్ వెంకటేశ్



బషీరాబాద్: విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న తహసీల్దార్ వెంకటేశ్, ఉపాధ్యాయులు

బషీరాబాద్: పేద విద్యార్థులకు ‘సాక్షి’అందిస్తున్న చేయూత అభినందనీయమని బషీరాబాద్ తహసీల్దార్ వెంకటేశ్ అన్నారు. శుక్రవారం ‘సాక్షి’ దినపత్రిక ఆధ్వర్యంలో మండలంలోని బషీరాబాద్‌లో జెడ్పీ బాలుర, బాలికల ఉన్నత పాఠశాల, కేజీబీవీ, మోడల్ స్కూల్, ఎక్మాయి, నావల్గా, గొట్టిగఖుర్దు జెడ్పీ పాఠశాలల్లో 250 మంది 10వ తరగతి ఇంగ్లీష్ మీడియం విద్యార్థులకు ఉచితంగా స్టడీమెటీరియల్ అందజేశారు. మండల కేంద్రంలోని బాలుర పాఠశాలలో మెటీరియల్ అందజేసిన తహసీల్దార్ మాట్లాడుతూ.. మెరుగైన సమాజం కోసం సాక్షి పత్రిక సామాజిక సేవా దృక్పథంతో పనిచేయడం ఆదర్శనీయమని కొనియాడారు. విద్యార్థులు అవకాశాలను వినియోగించుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సాక్షి ఎస్‌ఆర్ చేతన్‌కుమార్, ప్రధానోపాధ్యాయులు షరీఫ్, హీర్యానాయక్, ఉపాధ్యాయులు నాగరాజు, సాక్షి ఏజెంట్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఎంతో ఉపయుక్తం

యాలాల: ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థుల కోసం ‘సాక్షి’మీడియా ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్ అందించడం అభినందనీయమని యాలాల పీఏసీఎస్ చైర్మన్ గుర్రాల సురేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అగ్గనూరు ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. పదో తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు మెరుగైన ఫలితాల సాధనకు సాక్షి స్టడీ మెటీరియల్ ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. సాక్షి మెటీరియల్‌ను పలువురు సబ్జెక్టు ఉపాధ్యాయులు పరిశీలించి అభినందించారు. అనంతరం కేజీబీవీ, యాలాల బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎం సుధాకర్, కేజీబీవీ ఎస్‌ఓ మంగమ్మ, అగ్గనూరు మాజీ సర్పంచ్ భీమప్ప, సొసైటీ డైరెక్టర్ వెంకటయ్య, ఎస్‌ఎంసీ మాజీ చైర్మన్ ఉప్పరి వెంకటయ్య, సీఆర్పీ ఇస్మాయిల్, ఉపాధ్యాయులు క్రిష్టారెడ్డి, విజయ్‌కుమార్, సిద్రామేశ్వర్, రవీందర్ రెడ్డి, వెంకటేష్ ప్రసాద్, సాక్షి సర్క్యులేషన్ ఎస్‌ఆర్ చేతన్‌కుమార్ తదితరులు ఉన్నారు.



యాలాల: అగ్గనూరు జెడ్పీహెచ్‌ఎస్‌లో..

అసంపూర్తి పనులకు బిల్లులు చెల్లించొద్దు

ఎక్మాయి ఎంపీపీఎస్ ఎదుట గ్రామస్తుల ఆందోళన



పాఠశాల ఎదుట ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

బషీరాబాద్: విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించకుండా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించొద్దని ఎక్మాయి ఎంపీపీఎస్ ఎదుట గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఉన్న మండల ప్రాథమిక పాఠశాల అభివృద్ధి పనులకు ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాల కింద రూ.6.20లక్షల నిధులు మంజూరు చేసింది. ఈ పనులను డ్వాక్రా సమాఖ్యకు అప్పగించారు. పాఠశాలలో ఇప్పటి వరకు చేపట్టిన పనులకు రూ.1.56లక్షలు చెల్లించారు. కాగా ప్రభుత్వ ఖాతాలో జమచేసిన రూ.2.13లక్షలను ముందస్తుగా చెల్లిస్తే పనులు పూర్తి చేస్తామని మహిళా సంఘం కాంట్రాక్టర్లు అంబిక, స్వరూప, పాఠశాల హెచ్‌ఎం సుప్రియను కోరారు. దీంతో విషయం తెలుసుకున్న గ్రామస్తులు పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణాలు, తాగునీటి వసతి పనులు పూర్తి చేయకుండా బిల్లులు చెల్లించవద్దని విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలకు చేరుకుని ఆందోళన చేపట్టారు. వేసవిలోనూ తమ పిల్లలకు తాగునీటి సౌకర్యంలేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే మరుగుదొడ్ల నిర్మాణాలు, తాగునీటి వసతి కల్పించాలని ప్రధానోపాధ్యాయురాలిని కోరారు. ఈ ఆందోళనలో గ్రామస్తులు మంజునాథ్, అర్జున్, కాశీనాథ్, శ్రీమంత్, ఎల్లప్ప, చంద్రప్ప, తమ్మప్ప, వెంకటప్ప పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం

మర్పల్లి: మండలంలోని బూచన్‌పల్లి వ్యవసాయ క్షేత్రంలో శుక్రవారం భూలక్ష్మి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన బస్వారాజ్, రవి సొంత డబ్బులతో అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఉదయం హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

కళ్లకు జండూబాం పెట్టి..

- బంగారు గొలుసు చోరీ

నవాబుపేట: ఒంటరిగా ఉంటున్న వృద్ధురాలి కళ్లకు జండూబాం పెట్టి ఆమె మెడలోంచి బంగారు గొలుసు ఎత్తుకెళ్లిన ఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ అరుణ్‌కుమార్ తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని మాదిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన రుక్కమ్మ ఇంట్లో ఒంటరిగా ఉంటుంది. విషయాన్ని గమనించిన గ్రామస్తులు కుంటి సునీత, వెంకటేశం దంపతులు సోమవారం వృద్ధురాలి కళ్లకు జండుబాం పెట్టి కనపడకుండా చేశారు. అనంతరం ఆమె మెడలో ఉన్న తులంన్నర బంగారు గొలుసును అపహరించారు. ఆ గొలుసును విక్రయించగా వచ్చిన డబ్బుతో మొబైల్ ఫోన్, ఇంట్లోకి సామగ్రి కొనుగోలు చేశారు. మిగిలిన డబ్బుతో తాగి జల్సాలు చేశారు. అనుమానంతో దంపతులను విచారించగా నేరం అంగీకరించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఠాణాలో వ్యక్తి హల్‌చల్

తాండూరు రూరల్: మద్యం మత్తులో ఠాణాలో హల్‌చల్ చేసిన వ్యక్తికి ఏడు రోజుల పాటు జైలు శిక్ష విధించారు. పెద్దేముల్ పోలీసులు తెలిపిన క్రారం.. పెద్దేముల్‌కు చెందిన బోడె వెంకటప్ప గురువారం రాత్రి మద్యం తాగి స్టేషన్‌కు వచ్చి నానా హంగామా చేశాడు. దీంతో పోలీసులు ఆయనపై కేసు నమోదు చేసి శుక్రవారం కోర్టులో ప్రవేశపెట్టారు. ఈ మేరకు ట్రెయినీ కలెక్టర్, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఉమాహారతి ఏడు రోజుల జైలు శిక్షతో పాటుగా రూ.వేయి జరిమానా విధిస్తూ తీర్పునిచ్చినట్లు పోలీసులు తెలిపారు.

పరామర్శ




శంకర్‌ను పరామర్శిస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్


మోమిన్‌పేట: కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శంకర్ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. నగరంలో చికిత్స పొందిన ఆయన గురువారం ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యారు. విషయం తెలుసుకున్న అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్ కుమార్ శుక్రవారం మండల పరిధిలోని మేకవనంపల్లిలోని శంకర్ నివాసానికి చేరుకుని ఆయన్ను పరామర్శించారు. ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు.

పశువుల పాకకు నిప్పంటించిన దుండగులు

ఓ గేదె మృతి, మరో ఐదింటికి గాయాలు



కాలిపోయిన పశువులపాక



గేదె కళేబరం

బొంరాస్‌పేట: మండల పరిధిలోని లింగన్‌పల్లిలో పశువుల పాకకు గుర్తు తెలియని దుండగులు నిప్పంటించారు. ఈ ఘటనలో ఓ గెదె మృత్యువాత పడగా.. మరో ఐదు గేదెలకు గాయాలయ్యాయి. బాధితులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన మొగిలి రాములమ్మ కుటుంబ కుటుంబ సభ్యులు గురువారం రాత్రి భోజనం చేసి నిద్రకు ఉపక్రమించారు. ఈ క్రమంలో తమ ఇంటికి ఆనుకున్న పశువుల పాకలో అర్ధరాత్రి మంటలు చెలరేగడంతో చుట్టుపక్కల వారు అదుపులోకి తెచ్చారు. అప్పటికే ఓ గేదె మృతి చెందగా మరో ఐదు గేదెలు గాయపడ్డాయని.. ఈ ఘటనతో తమకు రూ.లక్ష నష్టం వాటిల్లిందని ప్రభుత్వమే తమను ఆదుకోవాలని కోరారు.

హోరాహోరీగా కబడ్డీ ఫైనల్ మ్యాచ్

మూడోస్థానంలో రంగారెడ్డి జట్టు

ఆదిలాబాద్: 71వ అంతర్ జిల్లాల సీనియర్ పురుషుల కబడ్డీ పోటీల్లో సూర్యాపేట జట్టు విజేతగా నిలిచింది. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రియదర్శిని స్టేడియంలో ఈ నెల 4న కబడ్డీ పోటీలు ప్రారంభం కాగా శుక్రవారం ముగిసాయి. రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ టోర్నీలో రాష్ట్రంలోని 34 జిల్లాలకు చెందిన 500 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఫ్లడ్ లైట్ల వెలుతురులో సింథటిక్ మ్యాట్లపై నాలుగు రోజుల పాటు డే నైట్ మ్యాచ్‌లు నిర్వహించారు. శుక్రవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో సూర్యాపేట జట్టు నల్గొండ జట్టుపై 39–33 పాయింట్ల తేడాతో విజయం సాధించింది. గత ఏడాది సైతం ఈ టోర్నీలో ఈ రెండు జట్లే తలపడగా.. నల్గొండ జట్టు విజేతగా నిలిచింది. ఈసారి చరిత్రను తిరగరాస్తూ సూర్యాపేట చాంపియన్ షిప్ కైవసం చేసుకుంది. నల్గొండ జట్టు రెండో స్థానంలో నిలువగా.. వనపర్తి, రంగారెడ్డి జట్లు సంయుక్తంగా మూడో స్థానంలో నిలిచాయి. ఇంటర్నేషనల్ కబడ్డీ ఫెడరేషన్ డైరెక్టర్ జగదీశ్వర్ యాదవ్ విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ కబడ్డీ టీం మాజీ కోచ్ ఎల్. శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ కోశాధికారి రవికుమార్, రాష్ట్ర సంఘం జాయింట్ సెక్రెటరీ గట్టయ్య యాదవ్ పాల్గొన్నారు.

జింకను ఢీకొట్టిన గుర్తు తెలియని వాహనం



జింకకు వైద్యం చేస్తున్న పశువైద్యులు

నవాబుపేట: గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో జింకకు గాయాలయ్యాయి. ఈ ఘటన శుక్రవారం ఎక్‌మామిడిలో చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన ప్రకారం.. గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఓ జింక రోడ్డుపై పడి ఉంది. గమనించిన గ్రామస్తులు వెంటనే ఓ వాహనంలో వికారాబాద్ పశువైద్యశాలకు తరలించారు. చికిత్స అనంతరం వైద్యులు ఫారెస్టు అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఫారెస్ట్ రేంజ్ అధికారి కార్తీక్‌రెడ్డి సిబ్బందితో జింకను అనంతగిరి ఫారెస్టుకు తీసుకెళ్లారు.

బాలికతో స్కూల్ బస్సు డ్రైవర్ అసభ్యకర ప్రవర్తన

- పాఠశాల వద్ద బాధితులు, విద్యార్థి సంఘాల ఆందోళన
- డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు



పాఠశాల ముందు ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘాలు

శంషాబాద్: ఒకటో తరగతి చదివే ఆరేళ్ల చిన్నారితో పాఠశాల బస్సు డ్రైవర్ అసభ్యంగా ప్రవర్తించిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. విషయం తెలిసిన తల్లిదండ్రులతో పాటు విద్యార్థి సంఘాలు పాఠశాల ముందు పెద్ద ఎత్తున ధర్నా చేశారు. ఈ సంఘటన శంషాబాద్ పట్టణంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని ఇన్‌ఫాంట్ జీసస్ పాఠశాల యాజమాన్యం ఈ నెల 4వ తేదీన విద్యార్థులను విహార యాత్రలో భాగంగా ఓ రిసార్ట్స్‌కు తీసుకెళ్లారు. మూత్ర విసర్జన కోసం బాలికను పక్కకు తీసుకెళ్లాలని ఓ టీచర్ చెప్పడంతో బస్సు డ్రైవర్ ఆ బాలికను పక్కకు తీసుకెళ్లాడు. మూత్ర విసర్జన అనంతరం బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించాడు. శుక్రవారం బాలిక తనకు నొప్పిగా ఉందని తల్లిదండ్రులకు చెప్పడంతో విషయం తల్లిదండ్రులు వారి బంధువులు పాఠశాల వద్దకు చేరుకుని ఆందోళన చేశారు. డ్రైవర్లను వరసగా నిల్చోబెట్టి ఎవరు చేశారని పోలీసులు అడగడంతో జోసఫ్‌రెడ్డి డ్రైవర్‌ను చూపించడంతో ఆయనను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పాఠశాల వద్ద ఏబీవీపీ, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులతో పాటు మున్సిపల్ మాజీ చైర్మన్ బండిగోపాల్ యాద వ్‌లు ఆందోళన చేపట్టగా పోలీసులు వారిని సముదాయించారు. సంఘటన మంచాల పోలీస్ స్టేషన్ పరిధిలో జరగడంతో కేసును అక్కడికి బదలాయించారు.